చెరుకూరి విరుజల్లులు, చిరు మెరుపులు
పద్యాలు
చెరుకూరి వీరయ్య

నా మాట

ఈ పద్యాలు నాకిష్టమైన 'ఆటవెలది' పద్యరూపంలో రచించాను.

నేను వృత్తిరీత్యా నీటిపారుదల ఇంజనీరును, ప్రవృత్తిరీత్యా సాహిత్యాభిమానిని; కొద్దిపాటి సాహితీ స్రష్టను కూడా. నాకు ప్రజలతో ముఖ్యంగా రైతులతో వృత్తిరీత్యా సాన్నిహిత్యం ఉండటం వల్ల, అలాగే రాజకీయ నాయకులతోను, ఇతర పెద్దలతో కొంతవరకు పరిచయాలు ఏర్పడటంవల్ల, ప్రస్తుత సామాజిక వ్యవస్థ పట్ల, దానిలోని రుగ్మతలపట్ల కొంతవరకు అవగాహన ఉంది. ఆ అవగాహనే ఈ పద్యరచనకు ప్రేరణగా నిలచింది.

నేను ఏదో వ్రాయాలని ప్రయత్నించి, కూర్చొని, వ్రాసిన పద్యాలు. ఏదైనా భావం ఎప్పుడైనా మనోవీధిలో స్ఫురిస్తే, అప్పటికప్పుడు ఆ భావానికి అక్షర రూపం కల్పించాను. అందుచేతనే ఈ పద్యాలన్నీ ఒక నిర్దిష్టమైన విషయ క్రమంలో లేక ఒక 'కలగూర గంప' గా తయారయినై. వాటిని అక్షర క్రమంలోనే ప్రచురించాను.

వేమన పద్యాలు రూపంలో చిన్నదైన 'ఆటవెలది'లో సరళమైన పదాలతో కూర్చబడటం వల్ల, సమకాలీన సామాజిక స్థితిగతుల్ని ప్రతిబింబించటం వల్ల, ప్రజల నాల్కల మీదకు తేలికగా చేరిపోయాయి. వారి మనసుల్లో శాశ్వతంగా నిలచిపోయాయి.

వేమన అడుగుజాడల్లో సామాజిక స్పృహతో, చదువుకోటానికి, చదవడానికి వీలుగా, చిన్న చిన్న పదాలనే పద్యాలలో వాడాను. నా కవితకు ఊపిరి ప్రేరణ. 'మనిషే' ఇంకేం? వస్తుపరంగా కావలసినంత సరుకు లభ్యమయింది. **'ఉన్నమాట ...'** అనే మకుటాన్ని నా పద్యాలకు తగిలించటంలో నా ఉద్దేశం ఏమిటో విశద పరచాలి.

ఇప్పుడు నేను చెప్పే యీ విషయాలన్నీ ఎందరో, ఎప్పుడో, ఎక్కడో చెప్పినవే; నేను క్రొత్తగా చెప్పేది చాలా తక్కువ, మరయితే 'చర్విత చర్వణం' , 'పిష్ట పేషణం'లాగా చెప్పిందే చెప్పటం ఎందుకని ఎవరైనా అడుగవచ్చు. దానికి నా సమాధానం

ఒకటే. గతంలో ఎందరో ప్రవక్తలు, మేధావులు, కవులు ఎన్నో నీతులు వల్లించారు. ఎన్నో విధాలుగా సమాజాన్ని హెచ్చరించారు. అయినా ఫలితం శూన్యం. సమాజంలోని రుగ్మతలు తొలగిపోలేదు, సరిగదా అవి మరింత పెచ్చు పెరిగాయేమోననిపిస్తుంది. అందువల్లనే. మళ్ళీ మళ్ళీ ఆ నీతులను, ప్రవచనాలను సమాజానికి గుర్తుచేయటం ఎంతో అవసరమని నేను భావించాను.

స్నేహం చేస్తే ప్రాణమిస్తాడు, విరోధిస్తే ప్రాణం తీస్తాడు. ఇదే మనిషిలోని మానవ ద్వంద్వ ప్రవృత్తి. ఆ ద్వంద్వ ప్రవృత్తినే నా కవితలలో విశదపరచటానికి ప్రయత్నించాను. సరే! ఇక నా కవితల్ని చదవండి. ఒకటికి రెండు సార్లు చదివి విశ్లేషించండి! విమర్శించండి! సద్విమర్శ కృతికి సమకూర్చు ఖ్యాతిని-అని విశ్వసించిన నాకు నా కవితలోని మంచి చెడులను తెలియజేయండి!

నా అభ్యర్థనను మన్నించి. నా కవితపై తమ అభిప్రాయాల్ని తెలియజేసి. నాకు ప్రోత్సాహమందించిన ప్రజాకవి, డాక్టరు నాగభైరవ కోటేశ్వర రావు గారికి, మిత్రులు దుత్తా దుర్గా ప్రసాద్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

ఇట్లు

హైదరాబాదు

భవదీయుడు

26, జనవరి 1997

చెరుకూరి వీరయ్య

‘అమ్మ’యన్నయట్టి కమ్మని పదమును - పలుకలేని నోరు పాడుబావి - ఒజ్జనేర్పనట్టిదొక మాట ‘అమ్మ’యే
‘దేశభాషలందు తెలుగు లెస్స’ని బల్కు - పెద్దమనిషి తనదు పిల్లలకును - గఱపు నాంగ్ల భాష ‘కాన్వెంటు’స్కూళ్ళలో
‘బూతు’లాక్రమించి, చేతురు ‘రిగ్గింగు’ - కొనుదు రోట్లు సురను, ధనముఁ బంచి - ఎన్ని వెధవ కళలొ ఎన్నికలందున?
‘ముడుపు’లొసగి నపుడె ముగియును పనులెల్ల - ఇవ్వకున్న ‘రూల్సు’ఎదురు తిరుగు - రూల్సు మారుచుండు రూకల బట్టియే
‘లేటు’గాను నిద్రలేచి బెడ్ కాఫీలు - ‘క్లబ్బు’లందు ‘డ్రింక్సు’, కార్డు ప్లేలు - ‘హార్సు రేసు’వెరసి, అప్టుడేటు సొసైటి
‘హంత’యందు రొకని నంతంబుఁ జేసిన - వేలమందిఁ జంప ‘వీరుడంద్రు’ - శాంతి - సమరములకు సరిహద్దు లివ్వియే
అంగుళికిని గాయమైనచో తనువెల్ల - బాధనందు, నటులె ప్రజలు కొంద - రలమటింప జాతి యంతయు కుందిల్లు
అందమైన గణిక, యధికార మోహమ్ము - కోరి దరికిజేరు కోడెగాండ్ర - శీలమును హరించి, చెరచును బ్రతుకెల్ల
అందినపుడు జుట్టు, అందకున్నను కాళ్ళు - పట్టుచుందు రదను బట్టిచూచి - అరయనిట్టులుందు రవకాశవాదులు,
అక్షర శర చయము ననువుగా సంధించి - గురినిచూచి కొట్ట గుండెకుదులు - నధికశక్తివంతమక్షర తూణీర
అడిగి, తెలిసికొనిన నజ్ఞాని కాడిల, మౌనమూనినంత జ్ఞానికాడు, నేర్చి, తానొరులకు నేర్పుట సుజ్ఞాన మున్నమాట...
అడిగినంత కట్నమిడిన జాలును, కన్య గుణము, విద్య, రూపు గోరరింక, పట్టభద్రులయ్యు భావదరిద్రులే ఉన్నమాట ...
అడుగుఁదీసి, ముందుకడుగేసి నప్పుడే - గమ్యమెటులొ చేరగలడు మనిషి - కాక, చేరుటెటుల కదలక శంకతో?
అత్త - మామలెన్ని ఆరళ్ళు పెట్టిన నాత్మహత్య కూడ దబలలకును, సబలలై యెదిర్చి సాధించవలె హక్కు నున్నమాట ...
అదురు - బెదురు లేక, అలుకదెంతయు లేక, చెప్పదలచుమాట జెప్పవలయు నటుల గాక యున్ననది యేమి కైతరా? ఉన్నమాట
అనునయింపగనగు నైదేళ్ళ వరకును, తిట్టి, కొట్టనగు బదేళ్ల దనుక, తగును మిత్రుడన బదారేళ్ళ తనయుని ఉన్నమాట ...
అనుభవించు కొలది యతిశయిల్లును వాంఛ - నెయ్యిపడిన రగులు నిప్పువోలె - వాంఛలడచుకొనెడువాడె యోగీశుడు
అన్నమిడిన ఫలితమఱిగెడు దాకుండు? - జదువుఁజెప్ప ఫలము శాశ్వతమ్ము - అన్నిదానములకు మిన్న విద్యాదాన
అన్నముఁ దినవచ్చు నాకలి నారంగఁ - ద్రావవచ్చు నీరు దప్పిఁదీర్చ - ఆశఁదీర్చగలుగు ఔషధమిల లేదు

అన్నియున్న యాకు అణగారి యుండును - నిండుకుండ తొణకకుండు నెపుడు - అటులె విజ్ఞులుందురాడంబరములేక
అప్పు వలన గలుగు ముప్పు యెప్పటికైన దాతకైన, మరి, గ్రహీతకైన, అప్పులేనివాడు, అధిక సంపన్నుండు ఉన్నమాట ...
అమ్మ ఒడిని వీడి, ఆలి కౌగిలిజేరు - మునుపె చదువులెల్ల ముగియవలయు - పరిణయంబుతోడఁ బాడగు జదువెల్ల
అరటిపండు నొలిచి, యరచేత నిడినట్లు - తేటయైన కవిత తేజరిల్లు - అర్థమందకున్న నడవి రోదనమౌను
అరయఁదెలుగు వారికశుభమమావాస్య - యదియె పుణ్యదివస మరవలకును - మనిషి తలపునందె మంచైన, చెడైన
అరయనంతులేని యధికారమబ్బిన - మనిషి మనసు మిగుల మలినమగును - బధిరుడంధుడగుచు ప్రల్లదించుచు నుండు
అర్థమిలనొక పురుషార్థమందురు, కాని యగునె జీవిత పరమార్థమదియె? పరహితేచ్ఛ యొకటె పారమార్థికమౌను ఉన్నమాట
అవని నేరములను అరికట్టవలెనన్న శిక్ష తీవ్రతరము చేయవలయు, కట్టెచిన్నదైన కాళంబు చచ్చునా? ఉన్నమాట ...
అవసరంబులందు, నాపదలందున, పాయక నెపుడు సాయపడుచు, నిలచియుండువాడే నిజమైన మిత్రుండు ఉన్నమాట ...
ఆకలైన వాని కన్నము దొరకదు - అన్నమున్నవాని కాకలుండ - దిక, యశాంతి తొలగుటెట్టు లీలోకాన?
ఆగమించెనేని యణ్వస్త్ర యుద్ధము - జేతమందు, మరి, విజితుడు మ్రందు - నుర్వి యుద్ధమింక నున్మాదక్రీడయే
ఆటవెలది జగతి నలరించు రసికుల, నాటవెలదినడక, హంస నడక, ఆటవెలది కవిత అందాల విందురా ఉన్నమాట ...
ఆయమునకు మించి, వ్యయము జేసెడి వాడు పరమమూర్ఖుడనగ బరగు నిలను, ఉన్న దనుక సుఖమిచ్చు నున్నమాట ...
ఆర్ధికముగ దేశమతలాకుతలమగు - నొరయుఁ బ్రజల బ్రతుకు ధరలు హెచ్చి - అని రగుల్చుమంటలార వెన్నేళ్ళైన
ఆలి మాటలు విని యమ్మను తెగడును - అమ్మనూరిపోయ నాలిఁగాల్చు - మగువ లాడుకొనెడు మరబొమ్మ మగవాడు
ఆలినమ్మె నొకడు, అడవికంపె నొకండు, ఒడ్డిపందెమందు నోడెనొకడు, ఆడదిటుల మగని ఆటబొమ్మాయెగా ఉన్నమాట ...
ఆశనరుని జీవితాలంబమే, కాని ఆశయమ్ము మిన్న ఆశకన్న ఆశవరుసీ గూర్చు, నాశయమ్మిడు తృప్తి ఉన్నమాట ...
ఆశతన బ్రతుకు కాధారమై నిల్చు, నాశలేని బ్రతుకు అడవి బ్రతుకు, ఆశ హద్దు మీర నారటగల్గును ఉన్నమాట ...

ఆశలెన్నొ యిలను పాశములై లాగ, మనసు కోతివలెను మసలుచుండు, మనసు నదుపు జేయుమనిషి మనిషిరా ఉన్నమాట ...
ఆస్తిననుభవించు హక్కుండ వలె గాని, యాజమాన్యమునకు హక్కు కూడ, ధర్మశాస్త్రమునకు ఆది సూత్రంబిదే ఉన్నమాట ...
ఇచ్చుచున్న కొలది ఎచ్చుచునేయుండుఁ - దఱిగిపోవదెపుడు ధనముపోలెఁ - నక్షయంబు జగతి నక్షర సంపద
ఇచ్చునట్టి వారి కిచ్చెడు వారుందు రివ్వకున్న నెవ్వరివ్వరిలను, ఇచ్చి, పుచ్చుకొనకనేమి జీవనమురా? ఉన్నమాట ...
ఇడుములఁబడి, సాయమడుగువారలఁ దమ - ఇరుగు - పొరుగులవలె నెంచి, వారి - నాదరించవలయును మానవతయన్న
ఉగ్రవాదమరయ నున్మాద తత్త్వంబు - పిచ్చివానిచేతి విచ్చుకత్తి - ఎప్పుడెవరికెటుల ముప్పుఘటిల్లునో
ఉన్నవాని జూచి ఉమ్మలించుటకన్న, లేనివాని జూడ లెస్సయగును మేలు గూర్చు బ్రతుకు కీలకమ్మిది గదా ఉన్నమాట ...
ఉన్నవానిదెపుడు ఉన్నతకుల మౌను, లేని వాని కులము లేవడిదగ్గు, లోకసరళి గాంచి బ్రాకటమీనుడి ఉన్నమాట ...
ఉర్వి నూడ్చివేయు యుద్ధపిశాచిని - ప్రజలు కోరరెపుడు, ప్రభుతె గాని - ప్రభుల రాజ్యకాంక్ష ప్రజకు కంటకమాయె
ఉర్వీరామజన్మ ఊహయో సత్యమో - రామ జన్మభూమి రగడఁదెచ్చె - రహిని గూర్చలేని రామమందిరమేల?
'ఊళ్ళనేల వలెన ఉద్యోగముల జేసి? చదువులేలకొ కులసతికి'? ననెడు మౌఢ్యమంతరించి మగువ నేర్వగ వలె నున్నమాట ...
ఊహనింగికెగసి ఊళ్ళేలు చుండంగఁ - గాయుచుండె రాత గాడిదలను - అర్హతలను మించి యాశింప భావ్యమా?
ఎచట ధనము మూల్గు నినుప పెట్టెలలోన? తిండిగింజ ముఱుగుచుండు కొట్ల? తాండవించు నచట దారిద్ర్య దేవత ఉన్నమాట
ఎచటినుండి రాక? ఎచటకు పోకని - తెగని ప్రశ్నలేల తెలివి మాలి? - వచ్చిపోవుటొకటే వాస్తవ మిలలోన
ఎట కళాస్రవంతి హేల ప్రీతిని గూర్చు? నట్టి దేశమందు నతుల శోభ, కళలులేని అవనికాడుగా పడియుండు నున్నమాట ...
ఎట్టి ఘటననైన హేతువేదొయెఱింగి, విశ్వసించువాడె విబుధుడిలను, కాక, భేదమేమి మ్రాకుకు మనిషికి? ఉన్నమాట ...
ఎట్టి పదవినేలె? నెన్నేళ్ళు? అని గాక ఎటుల నేలెనన్న దెన్ననగును, పూవు పరిమళించి పూటున్న చాలదా? ఉన్నమాట ...
ఎడద గుడిని వెలయు ఈశుని గనలేక తీర్థమేగు నరుడు తెలివి మాలి, ఆత్మతత్త్వమరయ 'అహమే బ్రహ్మాస్మి' ఉన్నమాట ...
ఎడద పిడికెడైన కడలిలాగంభీర - మాశంతులేని యలల పగిది - ఉప్పతిల్లుచుండు నొక్కటొక్కటిగను

ఎడదగుడిని మురికి కడుగలేని నరుండు కాశి బోవ నెటులగలుగు ఫలము? మంచిమనసులోన మాధవుడుండురా ఉన్నమాట
ఎదుటి పక్షమైన నెదిరించవలయు, స్వపక్షమైన వంత బాడవలయు, నేటి రాజకీయ నీతి సూత్రంబై ఉన్నమాట ...
ఎద్దు చచ్చినప్పుడెముకయే మిగులును - మనిషి చచ్చినపుడు మాట మిగులు - మాట మంచిదైన మనిషి చిరంజీవి
ఎల్లలోక మొక్క ఇల్లని భావించి, ఎల్ల మనుజులొక్క తల్లి బిడ్డ లటుల మెలగిరేని అవనియే దివిగదా ఉన్నమాట ...
ఎవడు పక్షిజాతి కెగురంగ నేర్పెను? - ఎవడు చేపపిల్ల కీతనేర్పె? - సహజగుణములబ్బు జన్మము చేతనే
ఎవడునేల దున్నె? ఎవడు నాటెను మొక్క? ప్రత్తి దీసి ఎవడు బట్ట నేసె? అట్టివాని దాకనట్టివాడే మాల ఉన్నమాట ...
ఏండ్లు నేర్పుమనకు నెన్నియోపాఠాలు - దినములకుఁ నొకింత తెలియకుండఁ - దక్కబోదనుభవమొక్క దినంబులో
ఏ మతంబుతోడ నెట్టి బంధము లేక - నన్ని ధర్మముల సమాదరించి - లబ్ధిగాంచునదియె లౌకిక రాజ్యంబు
ఏమి చెప్పే గీత? ఏమి చెప్పె ఖొరాను? ఏమి చెప్పె బైబిలెంచి చూడ? 'తనువు నరులకిలను ధర్మసాధన'మని ఉన్నమాట ...
ఏరి వీరమాత?లేరి జగద్గురు? – లేరి త్యాగమూర్తులీధరిత్రి? - రత్నములు నశించి రాళ్ళు మిగిలెగదా
ఒంటెయలరె ఖరము ఓండ్రపెట్టగ విని - మురిసె ఖరము ఒంటె మురువు చూచి - అల్పులెపుడు మెత్తురవలక్షణములనే
ఒక మసీదు ప్రక్క నొకమందిరముఁగట్ట - మతసమైక్యతకును హితము గలుగు - గుడినిఁగట్టమేలె కూల్చి మసీదును?
ఒకట గాయపరచి ఉత్సాహపడుచుండు - నొకట మందు పూసి యూరడించు - వింతజీవి మనిషి విశ్వమంతటిలోన
ఒకని నదుపునందు నుంచ బూననివాడు - ఒకరి యదుపులేక నుండువాడు - మానవతను జాటు మహితాత్ముడిలలోన
ఒకరి యభిమతంబై యొప్పును మతమన, మనసు ననుసరించి మతము వరలు, మనసు మంచిదైన మతమును మంచిదే ఉన్నమాట
ఒక్కటపహరణలు, నొక్కట మారణా - లొకట దహనకాండ లొకట సమ్మె - లివియె భారతోర్వి నీనాటి దృశ్యాలు
ఒక్కరాయి గుడిని ఒప్పెను దైవమై, ఒక్క రాయి బాట ప్రక్క బడియె; ఇందులేని దైవమందులో నెటులుండు? నున్నమాట ...
ఒక్కసారి గద్దెనెక్కిన నాయకు - డోడకుండుటన్న దొక్కవింత – నేటిరాజకీయనిర్వాక మింతియే

ఒక్కసీటు కొరకు పెక్కురభ్యర్థులు - దేనికొరకొ ఇట్టి తీవ్రస్పర్ధ? - దేశ సేవకొరకా? దిగమ్రింగటానికో?
ఒడలు వంచడొకడు, ఒకడు దిక్కుల జూచు విశ్రమించు నొకడు వెఱపులేక, పనిని చేయు నొకడె ప్రతినల్పురకునేడు ఉన్నమాట
ఒరుల కలిమి జూచి ఓర్వలేని తనంబు, తనకదెంత యున్న దానివిలేమి, నరుని క్రుంగదీసి నరకము పాళేయు నున్నమాట ...
ఒరుల సుఖమె స్వసుఖమొక్కని కిలలోన - తన సుఖంబె పరులదను నొకండు - వరుస మంచిచెడుల నరయ భేదంబిదే
ఒరులు విశ్వసింప నొల్లని వాడైన - నరుడు తన్నుఁదాను నమ్మవలయు - నైతిక బలమిచ్చు నాత్మవిశ్వాసమ్ము
ఓటు మహితశక్తి యుర్విజనాళికి - బాటఁ జూపు సుపరిపాలనకును - చెనటికిడెడు ఓటు చేటును కొనితెచ్చు
ఓట్లు గుంజువరకు పాట్లెన్నొబడుదురు - అందలముల నెక్కి, యందరికను - ఏరుదాటినాక నేలనింకను తెప్ప?
కట్టుకున్న భార్య కడురూపవతియైన - పరసతిపయి మోజుఁ బడుచునుండు - పొరుగునున్న పెరటి పుల్లకూరే రుచి
కట్టుకున్న యాలి కన్నంబు బెట్టుట, ఉన్నయూరికెంతొ ఉపకృతి గను, చాటుకొనెడివాడు మేటి లొక్కుడు సుమా ఉన్నమాట ...
కట్నమిడుట, గొనుట, కడు తీవ్రనేరమే - కాని, రోజు కెన్ని ఘాతుకములు? - బాపవలయు వీని మహిళాసమాఖ్యలే
కడుపులోని బిడ్డ కదలాడినప్పుడే - కలలుఁగాంచు తల్లి కన్నబిడ్డ - పెరిగి, పేరుగాంచి, పెద్దవాడౌనని
కనకమంట దెపుడు కంసాలి వానింట - నంటుకొనును కుమ్మరింట మట్టి - చీడపట్టునటుల సిరిపట్టునా మరి
కనుమ ఖరకరుండు కన్ను లానిన మేర - కనును జ్ఞానదృష్టిఁ గవియెదైన - సవిత కానకున్నఁ గవి కానకుండునా?
కనులఁ జూచు సాటి మనుజుల ద్వేషించి - కనని దైవమునెటు గౌరవించు? - నమ్మరాదు వట్టినయవంచకుడు వాడు
కనులు గానబడవు, వినరావు వీనులు, నడకమారిపోవు, నడత మారు, నల్పుని కధికార మబ్బిన వేళలో ఉన్నమాట ...
కనులు రెండు, మరియు గర్ణంబులును రెండు - కాని, మనిషికొకటె కలదు నోరు - కనుట, వినుటెగాని, యనఁగూడదెక్కువ
కన్నియ వరియించు గాంతుని రూపమ్ము, తల్లి ధనము గోరు, దండ్రి విద్య, బంధుజనులు కులము, బరులు మృష్టాన్నంబు ఉన్నమాట
కరుణ, మైత్రి, సమత నెరయించు మనుజుండు నీతివంతుడుగను నెగడు చుండు, నీతి, మానవతకు నిజమగు జీవమ్ము ఉన్నమాట
కర్మ సూత్రమందు కట్టుబడి నరుండు మూఢ నమ్మకముల మునిగిపోయి మహిత శక్తిబాసి మట్టి ముద్దాయెగా ఉన్నమాట ...

కర్మకాండలనుచు గ్రతువులటంచును, డబ్బుగుంజుచుండ్రు దబ్బరగను, కుటిల మతులు పొట్టకూటికి నాశించి ఉన్నమాట ...
కర్రలేదు జీలకర్రలో పరికింప - నేతి బీరలోన నేయి లేదు - గుణము పేరులోనఁ గుదరదెల్లెడలను
కలసిపాటు పడిన గలుగు సుఖంబులు, వేరుబడిననాడు వెతలెమిగులు, నైదు వ్రేళ్ళు కలియ, హస్తంబు బనిజేయు నున్నమాట
కలిమి గలుగు వారుఁగల రెందరోయిల - నెన్నగాను దాతలెందరందు? - ఈవిలేని కలిమి తావిలేని సుమంబు
కలిమి గలిగేనేని కులముండు, బలముండు, కలిమిగలుగ బెరుగు గౌరవంబు, కలిమి నాశ్రయించు నిలసర్వగుణములు ఉన్నమాట
కల్లుద్రావి పిచ్చిగంతులు వేయును మైకమడగి మరల మనిషియగును, మతము నించు మదము మడగదు కడదాక నున్నమాట
కళల లక్ష్యమొక్క కళల కూర్పే కాక, సంఘహితము గోరి సాగవలయు, కళల కపుడె సార్థకతయు సిద్ధించును ఉన్నమాట...
కళలు విశ్వతోముఖములు, భాష, మతము, దేశ, కాలముల కతీతములగు, అనధికారదూతలన్యదేశములందు, నున్నమాట...
కవిత రూపుఁ జెంది, కాలానుగుణముగా - భావి కాలమునకు బాటఁ జూప - గలిగినపుడెవరలుఁ గలకాల మిలలోన
కసటుజిమ్మి, సతము కడుగుచుండు నొకండు మురికి నించి మిగుల మురియు నొకడు తరతరాల నుండి నరుల తత్త్వంబిదే ఉన్నమాట
కాని పనులు సలిపి, కప్పిడ గుజనులు గుడిని దీప మార్చ బెడుదు రొట్టు, దీపమారకుండ నాపునాలింగంబు? ఉన్నమాట ...
కాయమునకు పెద్దగాయము తగిలిన - మాపగలడు వెజ్జు మందువేసి - మనసు దెబ్బతినిన మందేది? కాలమే
కాయమునకుఁగల్గు గాయంబు మానును - మనసుగాయమైన మానుటెటుల? - కత్తిమొనను మించి కఱకు మాటయెవాడి
కావ్యమైన, శిల్పకావ్యమైన, నచల చిత్రమైన, చలన చిత్రమైన, మానవతను జాటి మహనీయ కృతియౌను ఉన్నమాట ...
కాసులెరను జూప మోసపోవగరాదు - లొట్టిఁజూప మనసు లొగ్గరాదు - ఓటు వేయవలయుమేటరి నేతకు (సు)
కుటిల బుద్ధితోడ గోతులఁద్రవ్వినఁ - దానె పడును వాటి లోన కడకు - చెరుపఁదలచువాడు చెడకుండునా మరి
కుల, మతాల అడ్డుగోడలు లేవంగ నిరుకుగదులు వెలసె నెడదయందు, మానవతకు చోటు మనసులో కరువాయె నున్నమాట
కులము క్రుళ్ళు నింపే కొందరి యెదలందు, మతము కొన్ని యెదల మలిన పరచె, మానవతను చాటుమనుజులే లేరాయె నున్నమాట

కులము మాదిగైన నెలత అరుంధతి పూజలందెనిలను పుణ్యసతిగ, కులముకంటె నెపుడు గుణమె ప్రధానంబు ఉన్నమాట ...
కులము, మతము, ధనము, కొలమానములు నేటి - ఎన్నికలకు నర్హతెంచునపుడు - నట్టిచో సమర్థ నాయకత్వంబున్నె?
కులవిభేదములఁ గూలిపోవగవచ్చు - మతవిభేదములును మాయవచ్చు - వర్గభేదములను వారింప సాధ్యమా?
కూడఁ బెట్టి ధనముఁ గుడువనోచనివాడు - పేదకంటె మిగుల పేదకాడె? - ఇనుప పెట్టెలోన నెంతున్న ఫలమేమి?
కూరు చుంద్రువేచి గోడపై పిల్లిలా - దూకు చుంద్రు పదవి దొరకు వయిపు - నేటి రాజకీయ నీచతత్వంబిదే?
కైత, కైత కొరకె కారాదు, మనిషిని తట్టి, కుదిపి, లేపి, ధైర్యమొసగి, కార్యదీక్ష గరపు కైతయె కైతరా ఉన్నమాట ...
కొండ కొండకెక్కి, బండ బండకు మ్రొక్కి - ముడుపులొసగుచుంద్రు మూఢమతులు - బండరాయి నరుని బ్రతుకును మార్చునా?
కొందరకును పదవి గ్రుడ్డి గవ్వసమంబు, పదవి కొందరికిల పాడియావు, పరగ పుణ్యజనులు పాపులిట్లుండురా ఉన్నమాట ...
కొడలైన దనదు కూతురేనని యెంచి, అత్తలెపుడు ప్రేమ నాదరింత్రొ, కానుపించవపుడే కట్నాల చావులు ఉన్నమాట ...
కొన్ని మారణహోమాలు, కులము పేర కొన్ని కుమ్ములాట్లు, కలహమూలములగు కుల, మతంబులవేల? ఉన్నమాట ...
కోట్లకొలది జనులు కూటికై తపియింప, కొద్దిమంది జేరి కులికె సిరియు, ఇట్టి యసమతలిక నెన్నాళ్ళొసాగవు ఉన్నమాట ...
కోడలున్నయత్త గుణవంతురాలైన - నత్తయున్న కోడలుత్తమ యగు - నోరుమంచిదైన నూరు మంచిదికదా
కోనలున్నచోట కొండలేర్పడుచుండు మిద్దెలున్నచోట మేడలేదు, పేదశ్రమను దోచి, పెంపారు ధనికుండు ఉన్నమాట ...
కోరి, పొందకున్నఁ గూరిమి హెచ్చగుఁ - గలిగియున్న దానికంటె నెపుడు - నందకున్నఁదీపి, అందినఁ బుల్లన
కోర్కెలనగ గొంటె గుఱ్ఱాల వంటివి, అదుపు జేయకున్న హద్దుమీరి వెర్రిగంతులేసి వెతలలో బడద్రోయు నున్నమాట ...
కోర్టు కెక్కియావు కొమ్ములాగునొకండు - వెనుక తోక లాగు వేరొకండు - పొదుగువద్దఁ జేరి పోరుఁ దీర్చు వకీలు
గడ్డిమేసి యావు కమ్మని పాలిచ్చు - ఖలుడు పాలుఁద్రావి కక్కువిషము - పశువు ఖలుని కంటె పది రెట్లుమేలగు
గణములు, యతి, ప్రాస, కడు ప్రయాసతొగూర్చి, పద్దెమల్ల నగునె అద్దికవిత? గుండెలోన దగిలి, కుదిపేదికైతరా ఉన్నమాట ...
గత చరిత్ర గతిని గమనించకున్న, నా - గతము నందె మరల బ్రతుకవలయు - ప్రగతిలేని జాతి సుగతికి దూరమౌ

గాలి కెగిరిపోవు గడ్డిపోచల వెంటి - కట్టగలదు మత్తగజమునైన - కలసియున్న జాతి కడ్డులేదవనిలో
గాలి దీపముంచి, 'కాపాడు దేవుడా' యనిన వెలుగగలదె ఆరిపోక? పొసగదెట్టి పనియు బురుష యత్నములేక ఉన్నమాట ...
గాలియేల వీచు? ఘనుడేల వర్షించు? తరులు నీడనొసగు? తపనుడెండ? కోరకుండనిడుట గొప్పగుణంబురా ఉన్నమాట ...
గుడికి బోవ రాదు, బడికి పోయిన రాదు, లోకనైజ మెరుగు లోకనమ్ము, బ్రతుకు పొత్తమందు పాఠంబు రాయది ఉన్నమాట ...
గుడిని దొంగలు పడి కొల్లగొట్టుచునుండ నేమిచేయలేక నిలచియున్న ప్రతిమ జగమునేలు ప్రభువెట్టులౌనురా? ఉన్నమాట ...
గుడిని మ్రింగునొకడు, గుడిలోని లింగంబు - మ్రింగు మరియొకండు, మించి గుడిని - గోపురమును మ్రింగ నోపువేరొక్కడు
గెలుపు, ఓటము లిలఁగలసియే యుండును - కడలియలలు లేచి, పడువిధాన - మనిషి నేర్వదగిన మంచి పాఠంబిది
చంద్రిక ఎటులుండు జాబిల్లి లేకుండ? వర్ధిలు ధూమమెటుల వహ్నిలేక? కార్యమెట్టులుండు గారణంబును లేక? నున్నమాట
చక్రమెన్నడైన సాగునాముందుకు అవనియడ్డుపడక నతిరయమున? కష్టపడక నెటుల గలుగు సుఖంబులు? ఉన్నమాట ...
చచ్చినపుడు మోయ, శవవాహకులు నల్వ - రుండవలయు, గాన నొప్పుగాను - చెలిమిఁజేయవలయు నలుగిరితోనిల
చట్టమనగ నొక్కసాలెగూడు విధాన - బడుగు కీటకములఁ బట్టివేయు - కందిరీగ, తెలుకలందులో చిక్కవు
చదివి జ్ఞానియైన చవట కంటే జగాన - చదువురాని చవట చాలమేలు - జ్ఞానియైన చవట హానిఁ గూర్చగలాడు
చదివిన చదువెల్ల చదువ నట్లున్నను - చదవని చదువున్నఁ జదివినట్లు - చదువుతో పనేమి? చాలించవచ్చింక
చదివినట్టి గృహిణి చదివించు పిల్లల హితము జెప్పుపతికి నెన్నొగతుల పడతి చదువు దేశ ప్రగతికి సోపాన మున్నమాట వీరయన్నమాట
చదువుకొని యొకండు సంతలో పశువాయె - విద్యలేక యొకడు వింత పశువు - నరుని మానవునిగ, నడుపు నుత్తమవిద్య
చదువువలన గలుగు సదసద్వివేకమ్ము చదువువలన బుద్ధి సంతరించు, చదువుకున్నవాడు జాతికే గరువమ్ము ఉన్నమాట ...
చన్నదేశ మందు గన్నదేశము గూర్చి పలుచమాటలెపుడు బలుకరాదు, అమ్మనొరులముందు నవమతించుటమేలె? ఉన్నమాట
చరిత రూపుదిద్దు జడుడు కానేరడు - మానవతను నెరపు మనుజుడెపుడు - తీర్చిదిద్దుట దీటైన చరితను

చాలకాలమాయె స్వాతంత్ర్యముదయించి - వెచ్చఁబోయె ధనము వేనవేలు - బాగుపడగలేదు పల్లె స్వరూపమ్ము
చింతకాల్చునరుని జీవించియుండగ - చితి దహించు బ్రతుకు చెల్లినపుడు - కాలకున్నవాడె కర్మ యోగి జగాన
చినుకుఁ, జేరి సెలయేరుగాపారు - వాగులెల్లఁ గలసి సాగు నదిగ - వ్యక్తి, వ్యక్తి కలసి శక్తిగా రూపొందు
చిన్నతనమునందు విన్నట్టి నీతులు - తీర్చి - దిద్దు నరుని తీరు - తెన్ను - క్రొత్తకుండనంటు నొత్తిలి రంగులు
చిన్నరాతియందె శివుడున్నచో, మరి చిన్నదేల? పెద్ద శృంగి గొలుతు, పెద్దలకు మ్రొక్క పెరగదా పుణ్యంబు? ఉన్నమాట ...
చిఱుతప్రాయ మందె శీలసంపద కూడు నమరబోదు పెద్దయైన పిదప వంగు మొక్కగాను వంగునా మ్రానయి? ఉన్నమాట ...
చీమ పుట్టలోనఁ బాములు చేరును - ఈగలుంచు తేనెనెత్తు నరుడు - పాటొకరిది కాగ, ఫలము వేరొకరిది
చీలదీసె నరుల సృష్టించి వర్ణాలఁ - గూలద్రోసె జాతి కుదురుపాటు - మూలమాయె మతము మూఢభావాలకు
చుట్టునలము కొన్న దట్టమౌచీకటి - దూరమగునె విధిని దూరినంత? - చెదరగొట్టనగును చిరుదివ్వె వెలిగించి
చెడ్డ తప్పులెన్న గడ్డిపోచలవలెఁ - బైకిదేలి కానబడుచునుండు - మునిగి లోతునకును ముత్యముల్గొనవలె
చెడ్డపాపములను చేయుచుండెడివాడు గుడికి బోయి తరచు గొణుగుచుండు, చిత్తశుద్ధి యున్న శిలపూజలేలరా? ఉన్నమాట ...
చెప్పుకొనగ తమకు గొప్పలు లేవాయె పరులు దూరుటాయె బలము తమకు, నేటి రాజకీయ పాటవం బియ్యదే ఉన్నమాట ...
చెప్పుచుందురెన్నో శ్రీరంగనీతులు, చెడ్డపనుల వారె చేయుచుంద్రు - ఆచరించనట్టి ఆదేశమదియేల? ఉన్నమాట ...
చెరువు నిండినపుడు చేరును కప్పలు - తేనెలున్న విరుల తేటిచేరు - కాసులున్నవానిఁగమ్ముదురెల్లరు
చేతమందు నొకటి, రాతమరొక్కటి - యైన నిలువగలదె యట్టి రచన? - చిత్తశుద్ధి వలయు నుత్తమ రచనకు
చేయఁదగిన మేలుఁ జేయనొల్లడు, కాని - చేయదగని చెరుపుఁ జేయబూను - తలప నిట్టులుండు ఖలు మనస్తత్వంబు
చేయగలుగువాడు చేసి చూపించును - చేతఁగాని వాడు చెప్పుచుండు - చెప్పుటెంతో సులువు చేయుట కంటెను
జగతిఁగానరాడు సర్వజ్ఞుడొకడైన - లేడొకింత తెలివిలేని నరుడు - ఒక్కొకడు సమర్థ డొక్కొకక్రియలోన
జగము రంగశాల, జనులందు నటకులు, బ్రతుకు నాటకమున పాత్రలెల్ల రభినయించి చనుదు రాటతీరెట్లున్న నున్నమాట ...

జనగణంబు పెరిగె, వనరులు తరిగెను, దేశప్రగతి మిగుల దీలుపడియె, మంది యెక్కువైన మజ్జిగ పలుచనౌ నున్నమాట ...
జనుల కేవగింపు, తనకంపు, తనకింపు - ఒరుల కంపు తనకు నోకరింపు - స్వపర భేదభావ సంకుచితుడు నరు.
జన్మవలన అగ్రజన్ములు కాలేరు, కర్మశుద్ధిలేని కారణమున, బ్రహ్మ నిష్ఠవలన బ్రాహ్మణుల్ కావలె నున్నమాట ...
జయము ద్వేషము, నపజయము దుఃఖమ్మును - పెంచు, విశ్వశాంతి డించు, యుద్ధ - మతి వినాశకారి మానవ జాతికి
జలకమాడడితర జంతువులను దాకి, సాటి నరుడు తాక స్నానమాడు, హీనుడాయెనె నరుడెల్ల ప్రాణులకన్న? ఉన్నమాట ...
జలధిఁజేర నదుల జలము దుర్వ్యయమగు - నేలఁదాక రాజనాలు పండు - బరులకుపకరించు బ్రతుకె ధన్యము కదా
జాతి, మత, కులాల చర్చకుఁదావీక - సాటిమనిషి కిలను సాయపడిన - మానవతకు పట్ట మానాడె మహిలోన
జాలువారవలయు సహజమ్ముగా కైత - రెమ్మ పుట్టినట్లు, కొమ్మనుండి - కానిచోనదెట్లు కమనీయమై యొప్పు?
జాలువారు సతము సంగీత నిర్ఝరి - ఆగఁబోవ దెవ్వరడ్డుకొనిన - హాయి గూర్చుమనసు కాహ్లాద మందించి
తండ్రి త్రాగుచుండుఁదనయుని యెదుటనే - తండ్రి కన్నుఁగప్పి త్రాగు సుతుడు - పశువు చేనుమేయ, బైటమేయునె దూడ?
తండ్రి నిధిని గూర్చి తనయుల కొసగిన - పనికిరాక వారు పాడగుదురు - చతురులగుదురోర్మిఁ జదివించి నట్లైన
తండ్రి మోదమొందుఁ దనయుడుత్తముడైన - తల్లి భేదమొందు త్రాష్టుడైన - తల్లి నేడిపించు తనయుని బ్రతుకేల?
తనదు ధర్మము నీల దైవంబుగానెంచి నిండు మనసుతోడ నిర్వహించు పూరుషనకు వేరె పూజలింకేలరా? ఉన్నమాట ...
తనదు ప్రతిభ వలనఁ దనరు నుత్తముడుగ - మధ్యముడగుఁదండ్రిమహితమునను - అధముడగును మామ యశమునఁబేరొంద
తనదు మతము గొప్ప, తన కులంబే గొప్ప, ఒరుల మతము, కులము ఒల్లమియగు, మలిన భావమిటుల మానవతను జంపె నున్నమాట
తనను తాను నమ్మఁదగనట్టి మనుజుని - మూఢ నమ్మకములు ముంచివేయు - వినునతండు వెర్రి వేదాంతములనెల్ల
తననుమించి నట్టి తనయులు గల్గిన తండ్రి సంతసించు తనివితీర, కొడుకు వలన తండ్రి కోరును ఓటమి ఉన్నమాట ...
తనువు వంగిపోయె, తలమ్రుగ్గ బుట్టాయె, ఊడిపోయె పళ్ళు, ఉడిగె జవము, ఐన దొలగిపోదు ఆశ నరుని వీడి ఉన్నమాట ...

తప్పుఁ దెలిపి, ఒప్పుఁజెప్పువాడు హితుండు - గొప్పఁ బొగడువాడు కుటిల మతుడు - బాగు - ఓగు నరసి సాగువాడు మనిషి
తప్పుఁదెలిసి దాని నొప్పుటమేలగు - సిగ్గదేల? తప్పుఁ జేయునటుల? - తప్పు, దిద్దుకొనుట గొప్పగుణంబురా
తరులు యెండకోర్చి, నరులకు బ్రాపిడు, నరుడు మేలు మఱచి నఱుకు దరుల, హితుల కెగ్గుసేయుటేమి న్యాయంబురా? ఉన్నమాట
తల్లి కోరుచుండు పిల్లలు క్షేమంబు - తనను వారలెంత తక్కుచున్న - చెడ్డ తల్లిలేదు, చెడ్డ బిడ్డలెగాని
తాడుగాఁ భ్రమించి, తాకఁగూడదు చేత - పాముగాఁ భ్రమించి పాయరాదు - పరికరించి చూచి, పదిలించుటేమేలు
తామసంబు కంటె ధర శాత్రవములేదు, తనివిమించి వేరె ధనములేదు, మంచి మనసు కంటే మరి సోయగము లేదు ఉన్నమాట
తిండిఁ దిన్న పుష్టి దేహమునకుఁ గల్గు - చదువుకున్న తుష్టి మెదడునకును - తిండి - చదువులేని దేశమెడారియే
'తిరిగి యాడుది చెడు, దిరుగక మగవాడు చెడును' అన్నమాట చెల్లదిపుడు, తిరిగి నేర్వగలరు నరనారులెవరైన నున్నమాట ...
తిరిగెడు వానికే తెలియును లోకమ్ముతిరుగనట్టివాడు తెలియలేడు, బావిలోని కప్పబయటేమి చూచును? ఉన్నమాట ...
తెగువఁజూపకున్న మగువలు మనలేరు - పురుషుడేలుచున్న పుడమి పైన - అణగియున్న కొలది యణగఁద్రొక్కుచునుండ్రు
తెలియకున్న నన్నితెలియునన్న జడుండు పండిత సభలందు భంగపడును కోటు విప్పలోన తూటులొపడు గదా ఉన్నమాట ...
తెలిసి గాలివాలు తెరచాప నెత్తును - త్రిప్పుగొడుగు నెండ దెసను బట్టి - పలుకునొప్పునటుల బ్రతుకు నేర్చినవాడు
దమనకాండ సైచి దళిత జనావళి ఎదురు తిరుగకుండు నెన్ని నాళ్ళు? తలుపు మూసి కొట్ట దలపడు బిల్లియు నున్నమాట ...
దమము, శమము, మైత్రి, దయ, దానముల చేత - మంచి మానవుడుగ మలచబడును - కానియెడల మనిషి కటిక బండయెగదా
'దున్న యానె' నన్న, 'దూడను పట్టుకొ మ్మ' నెడు మనసు తీరు మారవలయు, గ్రుడ్డినమ్మకంబు కూడ దెవ్వరికైన నున్నమాట
దున్ను కాలమందు దూరదేశముపోయి - కోత కాలమందు కొడవ లంది - కోయబూనువాడు కొయ్యన గాడురా
దేవుడనగ వేరె దేశమందున్నాడె మంచిమనిషి హృదయమందు గాక? దేవుడెపుడు వెల్గు జీవచైతన్యమై ఉన్నమాట ...
దేవుడున్నవాడ? తెరగెట్టిదాతని వాసమెద్ది? అనుచు వాదులాడి, ఎదను వెలుగు జ్యోతినెరుగంగ లేరాయె నున్నమాట ...
దేశ, కాలముల కతీతమై ఒప్పారు, నరయ జాతి, మతము లడ్డురావు, స్నేహబంధమిలను చిరకాలముండును ఉన్నమాట ...

దేహపుష్టి కలుగు తిన్నచో మనిషికి కలుగు నాత్మతుష్టి కళల వలన బ్రతుకు కళలు లేక పరిపూర్ణమెటులౌను? ఉన్నమాట ...
దైవకార్యమనుచు ద్రవ్యంబు గడియించి అందు సగము తానె యారగించు మోసగానికెటుల ముక్తి లభించురా? ఉన్నమాట ...
దైవముండుననుట తథ్యమో, మిథ్యయో - దైవమీయడెపుడు దర్శనంబు - కన్నతల్లిలను కనుపించు దైవము
దొరకు సానియైన దొరసాని యందురు, పురికి సానియైన భోగినియని, ఆశ్రయమును బట్టి యంతస్తుమారును ఉన్నమాట ...
ధరణి యుద్ధములను తరిమి కొట్టుటకునై - శాంతి కొరకు కృషిని సల్పవలయు - శాంతి మంత్రమొకటె చల్లార్చు యుద్ధాగ్ని
నరకుడెపుడొ చచ్చెనని వేడుకలఁజేతు - రెంతమంది నరకులిపుడు లేరు? - వారిఁగూల్చు సత్యభామలు కావలె
నరుడు రేపకడనె నారాయణుని జీరి, నిద్రలేపు విధుల నిర్వహింప నరుని మేలు కొలుపు నారాయణుండేడి? ఉన్నమాట ...
నరులఁ బ్రాణములనె హరియించును యముండు - వెజ్జు గుంజు ప్రాణ, విత్తములను - అన్న వైద్యరాజు యమధర్మరాజుకు
నవసి, ఎన్నొగతుల, నవమాసములుమోసి - జన్మనిచ్చి, ప్రేమసాకునట్టి - తల్లికంటె వేరెదైవత మిలలేదు
'నాది' యన్న పలుకు, 'మాది'గా రూపొంది, మరల 'మనది'గాను మారినపుడు, గిలియే గదా లోకమెల్ల నొక్కలో ఉన్నమాట ...
నారు బోయువాడె నీరుపోయు నటంచు, భ్రమసి, మంచి - చెడులు పాలుబోక, సమిత సంతుబడసి అలమటించుదు రిల నున్నమాట
నాల్గు ఫైట్లు, మరియు నాలుగు 'డ్యూయెట్లు' - 'బ్రేకు డ్యాన్సు', 'స్టెప్పు, రేపు సీన్సు, - వెరసి నేటి చిత్రవిజయకారణమగు
నింగి నుండి నీరు నేలపై కురియును - నేలమీది నీరు నింగికెగయు - నిచ్చిపుచ్చుకొనుట యీలోకనైజంబు
నిజము బలుకవలయు నిష్కరంబైనను నయముగాను మనసు నచ్చునటుల; చేదుమందుకైన చెలగు దియ్యని పూత ఉన్నమాట
నిన్న నేర్చినట్టి నీతులఁమఱుక - నేడు విధులఁజక్క నిర్వహించి - రేపు కలుగు బ్రతుకు తీపిని గొనవలె
నిన్న శత్రువైన నేడు మిత్రుండగు, మిత్రుడైన రేపు శత్రువగును, రాజకీయనటుల నైజమెంతో చిత్ర మున్నమాట వీరయన్నమాట
నిన్నఁ జేసినట్టి నేరములకుఁ దోడు - రేపుచేయఁబోవు పాపములకు - నేడు యనుతపించువాడెపో మాయావి
నిన్నుఁ జేరి, పొగడి, నీవైరులదెగడి - నీదు మెప్పుబొంద నెంచువాని - నొక్క కంట జూడకున్న ముప్పు ఘటించు

నిలువ గలిగితేని కలఁబడ జాలరు - కలియబడిన నెదుట నిలువలేరు - మెత్తగున్నవాని మొత్తబుద్ధగు గదా
నీతి, త్యాగనిరతి, నిష్పాక్షికత, దేశ సేవ, సక్రమమగు శిక్షణయును, కలుగు నేతలున్న నిలుచు ప్రజాస్వామ్య మున్నమాట...
నీతి, నియతి గల్గు నేతలుండిరి నా - అడ్డదార్లు ద్రొక్కుయధము లిపుడు - రాజకీయమింక రట్టుగా కెట్లుండు?
నీతి, పాపభీతి, నియమబద్ధత లేవు - దేశ సేవఁజేయ దీక్షలేదు - నేడు స్వార్థమొకటె నేతల పరమార్థ
'నీవు శుంఠ'వనిన, 'నీవెశుంఠ' వటంచు, నేతలొకరి నొకరు నిందలాడ, రాజకీయమిలను రట్టడిపాలాయె నున్నమాట ...
నెగడు పల్లెలందె నిజమైన భారతి - రైతె దేశమునకు రాజటంచు - రాత, కూతలందె, సేతలందున లేదు
నెలత అర్ధరాత్రి నిర్భీతిఁదిరుగాడఁ - గలలు గాంచినాడు గాంధి నాడు - పట్టపగలెనేడు భద్రత కరువాయె
నేతి కుండఁదింపి నేలపైఁ బెట్టిరి - ఉత్త కుండనెత్తిరుట్టి పైకి - ప్రతిభకేది చోటు పాలనా రంగాన?
నేలదున్ని, విత్తి, నీరిడి, పోషించి, కోతగోయ పంటచేతికందు, నటుల గాక ఫలము నాశింప భావ్యమా? ఉన్నమాట ...
నైతిక పథమందు నరులను నడిపింప - మతములెల్ల పుట్టె గతము నందు - దారి తప్పినేడు దానవులుగఁజేసె
నోట్లను వెదజల్లి, ఓట్లను రాబట్టి, సీట్లు గెలిచి, పెక్కు కోట్లు మ్రింగి, నీతికథలు, జెప్పు నేతలెక్కువ యైరి ఉన్నమాట ...
నోరు విప్పినంత నోరార్చు మాటలు, శుష్క ప్రియములవల శూన్యకరము లరయ రాజకీయ లౌక్యమింతేనయా ఉన్నమాట ...
న్యాయమందిరమున న్యాయము కరువాయె, ధర్మశాలయందు ధర్మమరుదు, నేతిబీరలోని నేతితీరాయెగా ఉన్నమాట ...
న్యాయమూర్తులరయ నన్యాయవర్తులై –స్వార్థపరులకిలనుప్రాపునిడిన - సంతకెక్కుఁగాదె, సాంఘిక న్యాయంబు?
పంజరమున చిలుక బైటకు బోజూచు, బోనులోని యెలుక బొఱియ జూచు, సకల జీవులిటుల స్వాతంత్రమును గోరు నున్నమాట
పందిగాఁ బదేండ్లు బ్రతుకు నీడ్చుటకన్న - నంది బ్రతుకుమిన్న నాలుగేండ్లు - రాసి కంటె బ్రతుకు వాసి ముఖ్యము గదా
పడయవచ్చునేమొ భౌతిక సౌఖ్యమ్ము సిరిని కూడబెట్టి నరుడు మహిని కాని, పొందగలడె మానసికానంద? మున్నమాట
పడుచుఁదనమునందుభర్తకు ప్రియురాలు - వయసుమీరగ 'సహవాసిని'యగు - ముదిమిలోనఁ భార్య 'ముఖ్యసేవిక'యగు
పతిని బాసి మగువ పలు బాములను బొంద, జాలిపడక, 'నష్టజాత' యనుచు, నెదుట బడిన దిడుదురిదియేమి న్యాయమో? ఉన్నమాట

పదములెంతొ చిన్న, భావంబు కడుమిన్న అల్లికెంతొ సరళ, మతినిశితము, కానిచో, నదెట్లు కైతయై రాణించు? నున్నమాట ...
పదవి కూడెనేని పడెడు మిడిసిపాటు, పదవి ఊడెనేని భంగపాటు, పదవి మనిషి నిటుల పలుపాట్లు పడజేయు నున్నమాట ...
పదవి నిల్పినపుడు భట్రాజు స్తోత్రాలు పీకివేసినపుడు పిచ్చితిట్లు రాజకీయనటుల రంగులింతేనయా ఉన్నమాట ...
పదవి నున్నవరకు బ్రహ్మరథము బట్టు వారెదరికి రారు పదవి పోవ, పదవి కూర్చుఘనత పదినాళ్ళ ముచ్చటే ఉన్నమాట ...
పదవి యున్నవేళ పన్నీటి జలకాలు, ఐనవారికెల్ల అందలములు, పదవి కల్పతరువు పాపాత్ములకు నిల నున్నమాట ...
పదవినందు వరకు పడరాని పాట్లును, దాని నిల్పుకొనగ తగని పనులు, దేశసేవ జేయతీరికే లేదాయె నున్నమాట ...
పదవియు, నధికార ప్రాబల్యమును, దేశ సేవజేయ మంచి త్రోవగాను తలచి మసలువాడె ధన్యుడు యిలలోన ఉన్నమాట ...
పద్యమైనగాని, గద్యమైననుగాని, ప్రజలనోట బలికి పరిఢవిల్లు సద్రచనకు వలయు సామాజిక స్పృహ ఉన్నమాట ...
పరుల జంపమనుచు బల్కిన మతమేది? ఏ ప్రవక్త పలికె నప్రియంబు? పరమతాసహనము నరుని పామరుజేసె నున్నమాట ...
పరులకుపకరించు కరములు కరములు, మేటి తలపులీనుమేధ మేధ, మధుర ప్రేమ జిలుకు మనసు మనస్సురా ఉన్నమాట ...
పలు పాటుబడెడు శ్రామికునకు కూడు - గుడ్డ - గూడు కూడినపుడె, సార్థకంబగు మన స్వాతంత్ర్య జీవన మున్నమాట
పల్లెలందు వెలసె భారతావని శోభ - పల్లెదేశమునకుఁ బట్టుగొమ్మ - పల్లెబాగు పడినఁ బ్రగతించు దేశమ్ము
పల్లెసీమ దశను బాగుసేయగ, చిత్త - శుద్ధితోడఁ ప్రభుత సిద్ధపడిన - చేతరించి జాతి సిరులతో వర్ధిల్లు
పవలు - రేయి, యెండ - వానలో శ్రమియించు కష్టజీవియందు గలడు ప్రభువు, దీనజనులసేవ దేవుని సేవరా? ఉన్నమాట
పాపబుద్ధితోడ బరుల కొంపల గూల్చి గుళ్ళు - గోపురముల గూర్చుచుండ్రు మంచి - చెడులెరుగని మందుడా దేవుడు? ఉన్నమాట
పాముచేతఁజచ్చు పాములవాడిల - వేటగాడు చచ్చు వేటయందు - రాజకీయుడీల్గు రాజకీయమునందె
పారద్రోలనగును భౌతికదాస్యమ్ము నెన్ని యేండ్లకైన నిడుముల బడి, భావదాస్యమటుల బాపంగ శక్యమే? ఉన్నమాట ...
పారుచుండు మురుగు బాటలపైననే - వఱులు మరుగుదొడ్లు బాటప్రక్క - శుద్ధపరచు నూళ్ళ శునక సూకరములే

పాలితులకు, దేశపాలకులకు, లక్ష్య - మొక్కటైన దేశమొందు స్థిరత - కానిచో యశాంతి కాకరంబగు గదా
పిరికివాడు చచ్చు పెక్కుసార్లు భయాన - ధీరు డొక్కసారి తీఱిపోవు - భయమె మృత్యువునకు 'బ్రతిరూపమిలలోన'
పిల్లల మనసెపుడు విప్పారి యుండును - సంకుచించు బ్రతుకు సాగుకొలది - బాల్యదశయె మానవతకు దర్పణమిల
పీడితజనతప్త వేదనామయగాధ - ఎదకు తగిలి కవిని కుదిపినపుడె - కూర్చగలడతండు గొప్ప కావ్యంబును
పుట్టి, గిట్టు చుంద్రు పుడమిపై నెందరో కడలి అలలు యెగసి, పడు విధాన, కాని, కోటికొకరె కారణజన్ములు ఉన్నమాట ...
పుట్టినట్టి నరుడు గిట్టుట సహజమ్ము, ఉదితభాను డస్తమొందునటుల, గిట్టిపుట్టుటన్న కట్టుకథే సుమా ఉన్నమాట ...
పుట్టినపుడు తాను భువికి దెచ్చిన దేమి? పోవునప్పుడు కొనిపోవునేమి? నెందుకింత నరుని ఆరాటంబు? నడుమ ఉన్నమాట ...
పుట్టువారు తుదకు గిట్టువారేయని తెలిసి సుంతయైన దెలివిలేక, చావుదలచి జనులు జంకుదు రేలకో? ఉన్నమాట ...
పుట్టుసగము కవిత పుట్టుకతోడనే, సాధ్యపడును సగము సాధనమున, అపుడె మంచి కవిగ నలరుదురెవరైన నున్నమాట ...
పూర్ణమానవుడుగ బుట్టంగా దేవుడే పదియు జన్మలెత్తవలసి వచ్చె మంచిమనిషి మించు మాధవుడెవడురా? ఉన్నమాట ...
పేదరిక, మవిద్య, పెనగు యాకలిబాధ - బానిసత్వమిలను ప్రబలియుండ - నెటుల సమసమాజమేర్పడు జగతిలో?
పేదవానికున్న పెన్నిధి సంతృప్తి - తనివిలేమి బీదతనము ధనికి - తనివి మించు కలిమి ధరణిలో లేదెందు
ప్రకృతి యాగ్రహింపఁ బంటలు పాడైన - రైతు నాదుకొనగరాదు ప్రభుత - పంట నమ్మఁజూప బలుకదు తగుధర,
ప్రకృతి హుంకరింప బాధిత ప్రజలకు రక్షణ నిధి గూర్చి, లక్షలంది నిలువున దిగమ్రింగు నీచులెయ్యెడ గాంచ నున్నమాట ...
ప్రజకు సేవఁజేయఁ బ్రతిన బూనిన వాడు - కోప, తాపములను జూపఁరాదు - కార్యకర్తకెపుడుఁగావలె సహనమ్ము
ప్రజకు సేవజేయ బ్రతినబూనిన నేత ముల్లెమూట గట్టు మోసబుద్ధి కంచె చేనుమేయ కాపూరకుండునా? ఉన్నమాట ...
ప్రజల యొక్క ప్రభుత, ప్రజలె పాలకులుగా, ప్రజకు హితము గూర్చి ప్రబలెనేని, సతము నిల్చుగద ప్రజాస్వామ్య సౌధమ్ము ఉన్నమాట
ప్రజలకు సేవఁజేయ, ప్రాతినిధ్యముగొని - విధులు, బాధ్యతలను విస్మరించి - జగడమాడుచుంద్రు చట్టసభలయందు
ప్రజలు బ్రతుకునందు ప్రగతిగాంచనినాడు - విప్లవాలు రేగు విశ్వమందు - ప్రగతి లేని దేశ భవితవ్య మంధమే

ప్రతిఘటించ గలుగు ప్రతిపక్షముండక - సాగదెట్టి ప్రభుత్వ చాలనాళ్ళు - అదుపు లేని యశ్వమటునిటు దూకును
ప్రతిభకు గురుతింపు పరగ దోడైనచో ప్రజ్వరిల్లు నదియు బహుముఖముగ మురికి గడుగ మెరయు ముత్తెము చందాన ఉన్నమాట
ప్రతిభయొక్కటున్న రచయిత కాలేడు - మంచి రచన వెన్క మనిషి నిలచు - మానవతయె ప్రాపు మంచి రచనకిల
ప్రాణ రహితమైన రాయి - రప్పకు మ్రొక్కి, సాటి మనిషి పైన జాలిలేక మానవతను మరచు మనుజుడు మనుజుడా? ఉన్నమాట
ప్రేమ కంటె మించి పెన్నిధి లేదిల పేదకైన, మరి, కుబేరుకైన, విఫలమైన ప్రేమ వీధిని పడద్రోయు నున్నమాట ...
ప్రేమ కుండమందుఁ బెనగొను జంటలు - తలచరెన్నడొకరి తప్పులొకరు - ప్రేమగ్రుడ్డిదనిరి పెద్దలందు కెగదా
'ఫైలు కదలదు, తగుబరువు బెట్టక, నెట్టి పనులు జరుగవిల 'సిఫార్సు' లేక, భ్రష్ట పట్టెనిటుల పాలనాయంత్రాంగ మున్నమాట
బయటఁబడగ లోని వారలు యోచింత్రు - లోనఁబొరగ వెలుపలున్నవారు - భళిర పెళ్ళియనగ 'బంగారు పంజర'
బాధ సౌఖ్యమనెడు భావన మధురమై - యుండవచ్చునేమొ యోగులకును? - సగటు మనిషి కెటుల సాధ్యమీ తత్త్వమ్ము?
బాధ్యతల వహించు పౌరులే అరుదైరి, హక్కులడుగు వారలెక్కువైరి, ఇంక దేశప్రగతి ఎట్టుల వర్ధిల్లు? నున్నమాట ...
బాబరీ మసీదుఁ బడగొట్టి, రామాల - యమును గట్ట పగలు యగ్గలించు - ఒక్క కన్ననొచ్చ నొక కన్నుమెచ్చునా?
బుడుతడేడ్చుచున్న బుజ్జగించుటకునై - బూచి బెదురు సూరిపోయరాదు - లేతమనసునంటు భీతిపోదెన్నడు
బుద్ధ దేవుడేడి? పూజ్యబాపూ ఏడి? - ఏది వీర ఝాన్సి? ఏడి బోసు? - మణులు లేవు నేడు, మట్టిముద్దలెగాని,
బ్రతికినంత వరకు బలుపాపముల జేసి, మరణశయ్యమీద హరిని దలచి, జన్మరహితుడైన జపమేల? తపమేల? ఉన్నమాట ...
బ్రతికినప్పుడెపుడుఁ బలుకనట్టి నిజమ్ము - కుదురు చావువేళ పెదవిపైన - మృత్యువునకు సత్యమెట్టి చుట్టమొగదా
బ్రతుకవలయుఁ బరుల బ్రతుకనీయగవలె - నన్న పరమ సూక్తి ననుసరింప - మనిషి మానవుడయి, మాననీయుండగు
బ్రతుకు నడ్డగలుగు బలవంతులెందరో - చావు నాపగలుగు జాణలేరి? - మరణమునకు వేయి మార్గముల్గలవిల
బ్రతుకు పుటలలోని పాఠాలు నేర్చి పెద్దలుదహరింత్రు పిన్నలకును పెద్దవారి మాట చద్దిమూటే సుమా ఉన్నమాట ...

మంచి - చెడులఁ దెలిపి, మనిషిని వదలక - హెచ్చరించు మనసు హితుని వలెను - వినకఁజెడును మనిషి, విన్నచో బాగుండు
మంచి జరిగెనేని మహిమదేవుని దండ్రు, కలుగ జెడుగు కర్మఫలితమండ్రు, మంచి - చెడుల కింక మనిషి బాధ్యతలేదె? ఉన్నమాట
మంచి పేరుఁనొంద మనిషికిఁ బదియేళ్ళు - చాలవు, చెడిపోవ చాలు దినము - మంచి బాట దూరమగు దాపు చెడుబాట
మంచి మనిషికొక్క మందలింపే చాలు - సాధు పశువుకొకటి చాలు దెబ్బ - చెడ్డవానికెట్టి శిక్షైనఁ జాలదు
మంచినెరిగి, దాని మన్నించగాలేదు - చెడని తెలిసి దాని విడువలేదు - నరుని తత్త్వమెరుగ నలువకైన తరంబె?
మండుచున్న ప్రజల గుండెలలోనుండి - వెడలఁబారు నెపుడు విప్లవమ్ము - జాతి ప్రగతిన చల్లారిపోయిన?
మగడు కట్టినట్టి మంగళసూత్రంబు దీయనగు నతండు బోయినపుడు చిన్ననాటి బొట్టు చెఱపెదరేలకో? ఉన్నమాట ...
మగని మనసు నెఱిగి, మసలెడి యిల్లాలు, సుగుణవంతులైన సుతు (త)ల గలిగి, తనివి జెందు నరుడు ధన్యుడు యిలలోన నున్నమాట
మతము నెంచరెవరు మగువ కౌగిలిలోన కులము నెంచరతి కులుకు జూచి, కుల మతాల కింక విలువెక్కడుందిరా? ఉన్నమాట
మతము మనసులందు మత్సరాలను పెంచె - చెలగెవేరు దనుక స్నేహలతను - శాంతినడచి భువిని సమరాంగణముఁజేసె
మతము, కులములన్ని మటుమాయమై పోయి, మనిషి మానవతతొ మనిన మహిని స్పర్ధలంతరించి, సఖ్యత పెంపొందు నున్నమాట
మతము నించవలయు మమతానురాగాలు మనిషి మనసులోని మకిలిగడిగి, మత్సరాలు పెంచి మత్తిడుమతమేల? ఉన్నమాట
మతముపైన దురభిమానంబు హెచ్చిన మనిషి రాక్షసుడుగ మారిపోవు హితము గూర్చలేని మతముతో బనియేమి? ఉన్నమాట
మతమువలన సంఘహితమేమి కల్గెనో - బోధపడదుచరితపుటలఁ ద్రిప్ప - మతముమూల మాయె మారణాలకు నేడు
మదము బెంచు, మనసు - మమతల నడగించు, నీతిడించు, బంధుప్రీతినించు, అతి నికృష్టరోగ మధికార యోగమ్ము ఉన్నమాట
మధుర గీతి వినిన మస్తమూచని వాడు - కూన రాగమైన రాని వాడు - ఉండడొక్కడైన యుర్వీతలంబున
మనసు తలచునొకటి, మాట మరొక్కటి, కడకు నాచరించు కర్మమొకటి నరుడు పతనమాయె నైతికంబుగ నేడు ఉన్నమాట ...
మనసు తెల్లనైన మైపూతలవియేల? వేరు భూషలేల విద్యయున్న? కావి బట్టలేల కర్మశౌచంబున్న? నున్నమాట ...
మనసు దనిపి మల్లెమాలలూచగవలె - నెదరగెల్చి మంట లెగచవలయు - నెందుకింక కవిత ఏది సేయగలేక?

మనసువిప్పి మనము మాటాడ నితరులు – నటులె నెమ్మనమున ననుకరింత్రు - ఇంతదూరమటకునిదంతియే
మనిషి చేసినట్టి మాయదైవం బెట్లు మనిషి వక్ర బుద్ధి మార్చగలదు? ఆత్మవెలయు జ్యోతి అతనిని శాసించు నున్నమాట ...
మనిషి తినగవలయు మనుగడ కోసమే మనుట కూడ దెపుడు దినుట కొరకె తిండిపోతు భువికి తీరని భారంబు ఉన్నమాట ...
మనిషి మనసునందు మమతలు వెదజల్లు ప్రతిభలేదు కులము, మతములకును, మానవతయె మనిషి మనసును సరిదిద్దు నున్నమాట
మనుజులందరిలను మనువు సంతతియైన ఏది పెద్దకులము? ఏది చిన్న? మనిషి చేసినట్టి మాయకులంబురా ఉన్నమాట ...
మనువులెన్నియైన మగవానికే చెల్లు, విధవ పెండ్లియాడ వెక్కిరింత్రు, నరులకొక్క నీతి, నారుల కొక్కటా? ఉన్నమాట ...
మభ్యపెట్టవచ్చు మనుజుడు మనుజుని మాయపుచ్చ తరమె మనసు నటుల పాప, పుణ్యములకు ప్రబల సాక్షి మనస్సు ఉన్నమాట
మలిన గుణము గలుగ మహివిప్రుడే మాల, మంచి గుణములున్న మాల ద్విజుడు, గుణముచేత కులము గణుతించవలెనిల నున్నమాట
మాట నీయవలయు మరిమరి యోచించి, ఇచ్చి, నిలుప వలయు నెటులనైన, మాటకేమి విలువ మన్నన లేకున్న? నున్నమాట
మాట సరసమైన మన్నన గొని తెచ్చుమాట పరుషమైన జేటు దెచ్చు మాటతీరు బ్రతుకు బాటకు మూలము ఉన్నమాట ...
మాటలెంచి చూడఁ కోటలు దాటును - కాలు సాగదెపుడు గడప దాటి - ఇటులనుండు నేటి ఎన్నిక బాసలు
మానవతము కద్దు - దానవతయు కద్దుకద్దు కరుణ, మైత్రి, కద్దు పగయు - మంచి - చెడుల కలుపు మానవనైజము
మానవతయె నరుని మించి మతంబిల మానవతయె తలప మంచికులము, మానవతను చాటు మనుజుడే దేవుడు ఉన్నమాట
మానసమొక దివ్య మందిర మందున్న మురికి గడిగి శుద్ధబరచి నపుడు నరుని బ్రతుకునందు నాకము విలసిల్లు నున్నమాట ...
'మా'ను కూడబెట్టి మరువు నాశించును మధువు గ్రోలినంత మగువ వలయు, మ'త్రయంబుజేర మనిషికధోగతే ఉన్నమాట ...
మారు కాలమెపుడు, మారును లోకమ్ము - మార్పు సహజసిద్ధ మవనియందు - మారలేని మనిషి మనజాల డిలలోన
మార్పు జేతురెంత మంచి నిర్ణయమైన నది విపక్ష భావమైన యెడల, నేటి రాజకీయ కూటవర్తనమిదే ఉన్నమాట ...
మాలడంటుకొనిన మైలబడితిమంచు మునుగుచంద్రు నీట మూఢమతులు, కాటివద్ద నతడె కడదాక నుండురా ఉన్నమాట ...

మిణుగు మెఱుగుసూపు మింట చంద్రుడులేక, శశిధరుండువెలుగు సవితలేక, ఇనుడు ఉదయమంద, మిణుగేది? శశియేడి? ఉన్నమాట
మిత్రకోటిలోన మేలైన మిత్రుండు - మంచిపుస్తకంబు మనుజునకును - విడచిబోవదెట్టి విషమఘడియనైన
మిత్రుడుండు పైన, శత్రు వుండును క్రింద - తరచువారి యునికి తాఱుమాఱు - రాజకీయమనగ రంగుల రాట్నమే
మిన్నకుండి రెల్ల మేధావి వర్గము అందలములనెక్కి రల్పమతులు దేశప్రజల కింక దేవుడే దిక్కాయె నున్నమాట ...
మురికివాడలందు మురిగెడు లోగిళ్ళు - బురదగుంటలందు పొరలు గొడ్లు - మశక, మక్షికముల మనికియాయెను పల్లె
ముష్టివానికింత ముద్దైన బెట్టరు, రాతిబొమ్మ గొల్చి రవలనిత్తు, రట్టి మూఢమతుల కెట్టి ముక్తి లభించు? నున్నమాట..
మెచ్చబోవడెంత మేటరినైనను తెలుగువాడు సాటి తెలుగువాని, తెలుగువారికిట్టి తెగులేల గల్గెనో? ఉన్నమాట ...
మెతుకు కానఁబడిన మెసగ దొంటిగ, తోటి - కాకులఁదిన బిలుచు, 'కావు'యనుచు - పంచుకొనునె నరుడు పది మందితోనట్లు?
మొదలు పెద్దదయ్యి ముదయపు నీడలా కురుచబడుచు నుండు కుజనమైత్రి, సాధుమైత్రి పెరుగు సందె నీడను బోలి ఉన్నమాట
మోకరిల్లి బ్రతుకు ముందుకీడ్చుట కంటె - నీదు కాళ్ళ నిలచి నీల్గుటొప్పు - బానిసత్వమనగ బ్రతుకుకాదది చావు
యువత ఉద్యమింప నుజ్జ్వలించును జాతి, యువత కొంకుపడిన నోటు పోవునొనరు జాతి ప్రతిభ యువశక్తి వల్లనే ఉన్నమాట
యువత శక్తి యుక్తులుపకరింప ప్రభుత్వ ఆలిఖించవలె ప్రణాళికలను అగతికమగు యువత అపమార్గమున బోవు నున్నమాట
'యోగి'యగును మనుజుడొకపూట తిన్నచో, 'భోగి'యగును రెండు పూటలైన 'రోగి' యగును తిన్నరోజుకు ముమ్మారు ఉన్నమాట
యోగ్యులైనవారి నూరక నిందించు, చెడ్డవారిమాట చెవినిబెట్టు, అంధుడై చరించు నధికార మబ్బిన నున్నమాట ...
రాజకీయ దుష్ట రాక్షసి తోడైన - మతపిశాచి సల్పుమారణాలు - తప్పత్రాగి కోతి నిప్పుఁద్రొక్కిన రీతి
రాజకీయమందు రాణించవలెనన్నఁ - దిట్టనెంచవలయు దీవెనలుగ - మదిని తలచరాదు మానమర్యాదల...
రాజకీయమనగ రంగుల వలయంబు ఒక్కసారి దాను జిక్కుకొనిన బైటబడగలేడు బ్రహ్మదేవుండైన నున్నమాట ...
రాజకీయమనగ రాలుగాయలకిల నంతిమ మజిలీగ నలరుచుండ, అట్టి రాజకీయమెట్టి మేలొనగూర్చు? నున్నమాట ...
రాజకీయమెల్ల రౌడీల కిరవాయె - సభలయందు, చట్టసభలయందుఁ - కేకలరుపులాయె, క్రియ శూన్యమైపోయె

రాయి రమణి యయ్యె రామపాదము సోకి, శిల్పిపదము సోకి శిలయు వేల్పు, నరుడు తక్కువెటుల నారాయణుని కన్న? ఉన్నమాట
రారు గడప దాటి రాహుకాలమునందు గ్రహణమందు రవిని గాంచి వెఱుతు రెంత చదువుకున్ననేమి ఫలంబురా? ఉన్నమాట
రాలు బువ్వలొకట, రాళ్ళు మరొక్కట, ప్రజకు సేవజేయ బయలు వోవ, నేత రెంటినేక రీతిని గొనవలె నున్నమాట ...
రేపకడనె లేచి రేయి సంసారిలా పల్లెకునుకు వేగ, పట్టణంబు సందడించు నెపుడు సానివాడ విధాన ఉన్నమాట ...
రొక్కమును గడించి బొక్కసంబున నింపి, అనుభవించ కొరుల కమరనీక కాపుగాయు నరుడు గర్భదరిద్రుడు ఉన్నమాట ...
లంచగొండితనము, మంచగొండితనము, కార్యదర్శకులుగ గ్రాలుచుండ, పదవి కూర్చగలదే ప్రజలకు మేలింత? ఉన్నమాట
లేడు చర్చిలోన, లేడు మసీదులో - లేడు గుడిని వెలయు లింగమందు - దేవుడుండు సతము దీన జనాళిలో
లోకమెల్ల నొక్కలోగిలి కావలె - విశ్వమానవులను వేడ్కఁగూర్చి - మనిషి దాగుకొనెడు మనికి పట్టదిగాదు
వంచన, అవినీతి వరలెడు ధరలోన నీతి, న్యాయములకు నిలువదరమె? కాకిమూక నడుమ కోకిల లుండునే ఉన్నమాట ...
వంతలడచు నెన్నొ వంతులు విభజించి - హెచ్చవేయు సుఖమునెన్నొరెట్లు - మైత్రి మేలుఁగూర్చుమనిషి కెన్నొవిధాల
వజ్రము తునియలగు వజ్రముచేతనే - ముల్లుఁ దీయనగును ముల్లుచేత - దొంగ చిక్కుమరొక దొంగకు సులువుగా
వనిత, కవిత తామె వలచి రావలె, గాని - బలిమిచేతఁ బొంద వలను పడునె? - సహజసిద్ధిలేక స్వారస్యమేముండు?
వర్తమాన లోకవర్తనమ్మును చాటి చెప్పుకవిత జనుల మెప్పు బడయు, వేమనార్యువాక్కు వేదవాక్కాయెగా ఉన్నమాట ...
వలపుగలుగ నెట్టి కలికియు రంభయే వలపుదొలగ నదియె వగ్గుముండ, వలపు గ్రుడ్డి దన్నవాక్కు నిజంబురా ఉన్నమాట ...
వాదముండుచోట ప్రతివాదముండును - బయటపడును నాడె వాస్తవమ్ము - వాదమెపుడు శుష్కవాదముకారాదు
వింటికెటులొ నారి, విభునకు నటులనే - పంచుఁ బతిని తాను వంగునొకట - నొకరులేనిచో మరొక్కరు వృధయెగా
విగత జీవుదలచి విలపించు మనుజుడు తానుచావకుండ మానునట్లు, ఎట్టి జీవినైన నినజుండు పరిమార్చు నున్నమాట ...
విద్యకు వెల హెచ్చె, వైద్యము ప్రియమాయె, న్యాయమంద దెక్కడర్థమిడక, నింక బ్రతుకుటెట్లు నిరుపేద జనులిల నున్నమాట

విద్యనభ్యసించి, విజ్ఞాన మార్జించి ఆర్థికముగ స్వేచ్ఛ నందినపుడె స్త్రీ సమాజమందు జీవించుమనిషిగా నున్నమాట ...
వినెడు వారలున్న వినిచెడువారుంద్రు - కట్టుకథలనెన్నొ కమ్మగాను - విన్న నమ్మరాదు వివరించిచూడక
వివిధ పదవులకును విద్యార్హతలు కద్దు, కాని, మంత్రిపదవి కర్హతేది? అగ్రనేతమాట కవునన్న చాలుగా ఉన్నమాట... -
విశ్వకవులు, శాస్త్రవేత్తలు, నేతలు గతము నందుమట్టి గలియుటెరిగి మిత్తి దలచి నరులు మొత్తుకొందురదేల? ఉన్నమాట ...
విశ్వమంత గెలిచి, విర్రవీగుట కన్న - తన్నుఁదాను గెలుచుటన్న మిన్న - మనసుఁగెల్వనోపు మనిషి బలాఢ్యుడు
విశ్వమందు వెలయు వివిధ జాతులమధ్య - గోడలడ్డియున్నఁ గూల్చి వైచి - స్నేహబంధమందు చేరదీయగవలె
విశ్వమొక్క గొప్ప విజ్ఞాన ఖని, యందు తిరిగి తిరిగి, దాని తీరులెల్ల తెలుసుకున్నవాడె ధీశాలి యిలలోన నున్నమాట ...
వైద్యశాలలేని పల్లెలు కొల్లలు - కలవు బడులు లేని గ్రామములును - నీరసించి బ్రతుకు నిర్భాగ్యులెందరో
వ్యధిత హృదయమెప్పు డమ్మని తలచినా - హాయిఁ గూర్చు బాధ నపనయించి - 'అమ్మ'యన్న పలుకు ఔషధ రాజంబు
వ్యాజ్యెమోడి యొకడు వగచును కోర్టులో నేడ్చునొకడు గెల్చి, యిల్లుచేరి, కోర్టుకేగనేల? గోడు జెందగనేల? నున్నమాట ...
శిశువెరుంగు, మరియు పశువు నెరుంగును – ఎరుగు గానరసము నిల ఫణంబు - ఎరుగనట్టి నరుడు కొరగాని వాడొకో
శిష్టగురుని యెడల స్థిరమగు భక్తితో నడచి, 'కోతి – పిల్ల' న్యాయమునను,(మర్కటకిశోరన్యాయం) నేర్చుకున్నవాడే నిజమైన శిష్యుండు
శిష్యకోటి నెపుడు జెరగని ప్రేమతో నరసి, 'పిల్లి – పిల్ల' న్యాయమునను, (మార్జాలకిశోరన్యాయము) నేర్పువాడె యిలను నిజమైన గురువురా
శిష్యులకును బోధసేయని గురువులు, గురుల దూలనాడు కొంటెశిష్యులరయ సడలిపోయె, గురు - శిష్య బంధంబు ఉన్నమాట
సంఘ సంస్కరణలు సాఫల్యమొందంగ ప్రభుత ఎఱుగవలయు ప్రజల మనసు, సహకరించవలయు స్వచ్ఛందసంస్థలు ఉన్నమాట
సంతుయొక్కరైన చింతలే యుండవు, ఇరువురైన గొంతవరకు మేలె, అంతకంటె మించు సంతతి భారమే ఉన్నమాట ...
సంస్కృతి యొక తరువు, సంగీత, సాహిత్య, శిల్ప, నాట్య, వాస్తు, చిత్రకళలు శాఖలై తనర్చు సాంస్కృతీ తరువుకు ఉన్నమాట
సకల జీవులిలను సహజీవనము జేయ, మనిషి మనిషిని గని మండిపడును, మనిషి వంటియున్న మాయరోగమదేమొ ఉన్నమాట
సతము గుడికి బోయి సాగిల బడి మ్రొక్కి జనముసేయ జన్మసఫలమగునె? రాతి బొమ్మయందు రాముడెట్లుండురా? ఉన్నమాట

సదరు లంచమిచ్చి పదవిని కొందురు పదవిబలిమినిధుల బడయు చుంద్రు పదవి మహిని ప్రముఖ వ్యాపార సాధన మున్నమాట
సద్విమర్శ కృతికి సమకూర్చు ఖ్యాతిని - మంచి - చెడుల నందునెంచి, చూపి - ఒరపు పెట్టకున్న మెరయునా స్వర్ణంబు?
సమకొనే నడిరేయి స్వాతంత్ర్య భారతి - తెల్లవారు టెపుడొ తెలియరాక - నటమటించుచుండె నంధకారమునందు
సమసిపోవ దెపుడ సమ్మతి వర్గమ్ము - పదవినేలు రాచపక్షమందు - అంతులేనిది కద, అధికార దాహమ్ము
సముఖమునఁ బొగడిక, చాటునఁ దెగడిక - నోటితోడ నవ్వు నొసలి విరుపు - ధూర్తజనుల కపటవర్తన మిటులుండు
సరస మధురమైన సంగీతమును విని - మనసు తనిసి స్పందమందనట్టి - నరుడు మాయికుండు నమ్మరాదతనిని
సర్వమొడ్డి రొకరు స్వాతంత్ర్యప్రాప్తికై పదవు లధివసించి ప్రబలి రొకరు, సొమ్మొకరిది, మరియు సోకు వేరొకరిది ఉన్నమాట ...
సుజనులుగ్గడించు సూక్తుల వినినంత - మంకు నైజగుణము మార్చుకొనునె? - మధురమగునె, కడలి నదుల నీరముఁగ్రోలి?
సుతుడు లేక ఇలను సుగతులు లేవని తలచి, సుతుని బొందు తమకమునను, సంతు పెంపుగాగ వంతల పాలౌదురున్నమాట
స్వార్థపరతనెవరు 'బందులు'జరిపినా - మూతురన్ని కొట్లు ముందుగానె - నష్టమునకు జడిసి, ఇష్టమై కాదులే
హత్యలుండవంట, ఆత్మహత్యలెగాని - మాయదారి రాజకీయమందు - అసలునాయకులకు నాత్మలుండిన గదా
హలము పరుగులెత్త యవని'సఫల'యగు - కలము కదల భువిని చెలగు 'గవిత' - హలము, కలము నిలువ నవని 'మట్టి'యెగదా